# మధుర భావన-12

''నేను బాగానే ఉన్నానుగా. నన్ను చూసుకోవటం ఏమిటీ...?''

''ఆరోగ్యంగానే ఉన్నారు సరే... అదికాదు.. మీ పార్వతి ఏం వండుతోంది...ఎలా చేస్తోందీ... మీకు నచ్చుతున్నాయా లేదా అని కనుక్కోవటంతో పాటుగా...'' అంటూ మాట మధ్యలో ఆపేసింది తిలోత్తమ.

'పూర్తిగా చెప్పకుండా మధ్యలో ఆగిపోయారేం' అన్నట్లు ప్రశ్నార్ధకంగా చూసాడు వంశీ.

మళ్ళీ నిట్టూర్చింది తిలోత్తమ.

''ఇంట్లో మీ అమ్మగారు లేకుండా ఒక్కరే ఉంటున్నారుగా, అందుకని... మీకు బోర్ కొట్టకుండా.. కొంచెం తోడుగా ఉండమని... వదిన చెప్పటంతో నేనిలా వచ్చాను. నారాకకు కారణం మీకు అర్ధమైందనుకుంటా...!''

ఇపుడు వంశీ నిట్టూర్చాడు.

''అమ్మ ఇంట్లో లేని లోటు... నిజమే... చాలా ఇబ్బందికరంగా ఉందిగానీ దాన్ని ఎవరూ భర్తీ చేయలేరు! అమ్మ ఆరోగ్యంగా ఇంటికి రావటమే నాక్కావలసింది! అది జరిగినపుడే నేను మామూలుగా ఉండగలనని అనిపిస్తోంది...!''

వంశీ మాటలకు తిలోత్తమ అవునన్నట్లు తలవూపుతూనే జవాబు చెప్పింది.. ''అది నిజమేగానీ... మిమ్మల్ని సరదాగా కాసేపు బయటకు తీసుకెళ్ళటం, ఇంట్లో కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకోవటం లాంటివి ఉంటే... బావుంటుందిగా. లేకపోతే... అస్తమానూ ఒకటే ఆలోచనతో దిగులుగా ఉండిపోతారని మా వదిన అనుకున్న మాట నిజమేనని నాకూ అనిపించింది. అందుకనే తన ఆలోచనని అంగీకరించి, వెంటనే బయలుదేరి వచ్చాను. ఏం... మీకేమైనా ఇబ్బందా...?'' తిలోత్తమ అతని వైపు ఓరగా చూస్తూ అడిగింది.

వంశీ కొంచెం తడబడ్డాడు.. ''అదేం లేదు... కాకపోతే... నాకంటే కూడా మీకే ఎక్కువ ఇబ్బందిగా ఉంటుందేమోనని అనిపిస్తోంది.! ఎందుకంటే... బయటకు వెళ్ళే పరిస్థితీ లేదు.. సరదాగా కాలక్షేపం చేసే మానసిక స్థితీ నాకు లేదు! అందుకని మీరే బోర్ గా ఫీలవుతారనిపిస్తోంది!''

తిలోత్తమ చిరునవ్వుతో ''అదేదో కొన్నాళ్ళు చూసి తేల్చుకుందాం... ఎవరెవరం ఎలా ఉంటామో...!'' అంది.

వంశీ ఏం మాట్లాడలేదు. అంగీకార సూచకంగా తలవూపి నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఆ సాయంకాలమే తిలోత్తమని వెంటబెట్టుకుని డాక్టరుగారి హాస్పటల్ కు వెళ్ళాడు వంశీ. తిలోత్తమ ను ఆయనకు పరిచయంచేసి లోపల తల్లి ఉన్న గదిలోకి తీసుకువెళ్ళాడు.

ఆశ్చర్యంగా... శ్యామసుందరి తిలోత్తమని గుర్తుపట్టింది. అంతేకాదు, ఆప్యాయంగా పలుకరించి ప్రక్కనే ఉన్న వంశీని చూపిస్తూ మెల్లగా అంది. ''ఇతనెవరో నీకూ తెలుసా... రోజూ వచ్చి నన్ను చూసి వెళ్తుంటాడు... ఎవరై ఉండొచ్చూ...?'' అనడిగింది. తిలోత్తమ చిన్నగా నవ్వింది. ''సరిగా... బాగా చూడండి... మీ అబ్బాయి వంశీయేగా...?''

ఆ మాటలకు ఆవిడ తల అడ్డంగా వూపింది. ''కాదమ్మా... మా వంశీ ఎందుకనోగానీ రావటం లేదు. నామీద కోపం వచ్చిందేమో తెలియటం లేదు. ఎక్కడకు వెళ్ళాడో, ఏమిటో...!'' అంటూ ఆవిడ నిట్టూర్చింది.

తిలోత్తమ ఆ మాటలకు ఆవిడవైపు విచిత్రంగా చూసింది.

వంశీ విలవిలలాడినట్లుగా మొహం పెట్టి... అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఎపుడో... ఏ రెండు మూడు సార్లో చూసిన చెల్లెలి ఆడబడుచును అమ్మ గుర్తుపట్టి ఆదరంగా మాట్లాడుతోంది... కానీ తన చేతులతో పెంచిన కొడుకును మాత్రం గుర్తు పట్టటం లేదు... దూరం పెడుతోంది! ఏమిటిది...! ఏదో వింత జబ్బులా ఉందే అనుకున్నాడు.

అదే బాధని డాక్టరు దగ్గర వెళ్ళగ్రక్కాడు. వంశీ మాటలను ఆయన విని ఓదార్పుగా చెప్పాడు ''ఇందులో వింత ఏమీ లేదు. కొందరిలా ప్రవర్తించటం జరుగుతుంది. ఎప్పటివో కొన్ని విషయాలు గుర్తు ఉంటాయి గానీ కొన్ని కొన్ని మర్చిపోవటం జరగొచ్చు. చాలా మంది విషయంలో ఇలా జరగటం నేను చూసాను. వైద్యమూ చేసాను. మీ అమ్మగారి విషయంలో నీకేం భయం అవసరం లేదు. ఆవిడ చాలా తొందరగా ఆరోగ్యవంతురాలవుతారని ఖచ్చితంగా చెప్పగలను! అధైర్యపడాల్సిన పనేం లేదు!''

డాక్టరుగారు భరోసాగా చెప్పిన ఆ మాటలకు వంశీ కొంత స్వాంతన పొందాడు, 'వైద్యం జరగుతోంది... అమ్మ ఇలా మామూలుగా ఉంటోంది... అదే చాలు' అనుకున్నాడు. 'భోజనం ఇంటి విషయాల్లో బాగానే ఉంది... తేడా లేదు. అది మేలేగా,' అనీ తనకి తనే నచ్చచెప్పుకున్నాడు.

ఆ రోజు సుమజ ఫోను చేసినపుడూ ఇదంతా చెప్పుకొచ్చాడు. 'అవునా' అంటూ సుమజ ఆశ్చర్యంగా వింది. ఆ తర్వాత రోజే సుమజ వంశీ వాళ్ళ వూరు వచ్చింది వాళ్ళమ్మ గారితో కలిసి. ముందుగా సుమజ ఒక్కతే ఆతృతగా వంశీ వాళ్ళ ఇంటికి వచ్చింది.

తలుపు తీసిన తిలోత్తమను ఆశ్చర్యంగా చూస్తూ ''మీరు...'' అంది తడబడుతూ. తిలోత్తమ సుమజను పరీక్షగా చూసి ''మా ఇంటికి వచ్చి... 'మీరెవరూ, మీకెవరు కావాలీ' చెప్పకుండా నన్నెవరన్నట్లు అడుగుతారేం...?'' అంది ధాటిగా.

ఆ తీరుకు సుమజ మరింత బిత్తరపోయింది.

ఒక క్షణం తడబాటును తగ్గించుకుని సుమజ చాలా మెల్లగా 'శ్యామసుందరిగారికోసం' అంది.

''ఓ... అత్తయ్యను చూడటానికి వచ్చారా...'' అని ''ఇంతకీ మీరెవరో చెప్పనేలేదూ...?'' అంది తిలోత్తమ.

సుమజకి ఓ క్షణం ఏం చెప్పాలో తెలియలేదు.

''నా పేరు సుమజ....'' అని దిక్కులు చూస్తుంటే, తిలోత్తమ మళ్ళీ ధాటిగా అంది

''మీ పేరు చెబితేనే సరిపోతుందా...మీరు... అత్తయ్యకి బంధువులా...?'' కాదన్నట్లు సుమజ తలవూపింది. మళ్ళీ మెల్లగా ''మీరు...'' అంటూ నసిగింది.

తిలోత్తమ ఈసారి మరింత విసురుగా అంది ''బావుంది మీరు నా గురించి చెప్పందే మీ గురించి చెప్పరన్నమాట! సరే, నేనే చెబుతాను. నేను... ఈ ఇంటికి కాబోయే యజమానురాలిని! ప్రస్తుతానికి అనధికారంగా! అర్థమైందిగా...?''

ఆ మాటకి సుమజ కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ''అంటే...!'' అంది ఆశ్చర్యంగా. ఇంతలో వంశీ ''ఎవరు వచ్చారు తిలోత్తమా...?'' అంటూ అక్కడకు వచ్చి సుమజను చూసి ''నువ్వు... ఎపుడు వచ్చావు సుమా...?'' అన్నాడు ఆనందం నిండిన మొహంతో.

తిలోత్తమ వంశీ వైపు చూస్తూ అడిగింది ''నీకీమె ఇంతకుముందే తెలుసా బావా...? నన్ను... ఎవరూ అనడుగుతూంటే... ఈ ఇంటికి కాబోయే యజమానురాలినని చెప్పేసా...!''

వంశీ ఆశ్చర్యాన్ని పట్టించుకోనట్లుగా... తిలోత్తమ చిన్నగా నవ్వింది.

''ఏం... నేను చెప్పింది నిజమేగా... మా వదిన ఇక్కడకు నన్ను ఎందుకు పంపిందని అనుకుంటున్నావ్...? నిన్ను పెళ్ళిచేసుకుని... ఈ ఇంటికి కోడల్ని... అంటే... యజమానురాలిని కావాలనేగా...?''

''నిజమా...? ఆ విషయం నువ్వు ఇంతకు ముందు చెప్పలేదుగా...మా అనూష.. నీకు 'సుమజ' గురించి చెప్పలేదా...?'' విస్మయంగా వంశీ అడుగుతూంటే... తిలోత్తమ మరింత ఆశ్చర్యంగా అడిగింది.

''సుమజ గురించా... వదిన నాకు ఏం చెప్పలేదు. ఈ అమ్మాయేగా... నేను ఎవరని అడిగితే పేరు 'సుమజ' అని చెప్పింది. పేరు చెబితే ఏం తెలుస్తుందని అనుకున్నానంతే. అయితే ఇపుడు చెప్పు.... ఏమిటి ఈ అమ్మాయితో సంబంధం...?''

వంశీ చిన్నగా నిట్టూర్చాడు.

''నువ్వు చెప్పిన సంబంధమే... ఈ అమ్మాయికి వర్తిస్తుంది! అనూషకీ విషయం తెలుసే, మరి... నీకు ఎందుకు చెప్పలేదో...!'' అని సుమజ వైపు చూస్తూ వంశీ అన్నాడు. ''ఈ అమ్మాయి... మా అనూషకు ఆడబడుచు. పేరు తిలోత్తమ... ఇంకో బిరుదూ ఉంది. తిక్క తిలోత్తమ అని! ఇపుడు చిన్నపుడున్నంత తిక్క లేదుగానీ, అపుడపుడూ కొంచెం రేగుతుంటుంది! అందుకే... రాగానే నన్నూ... ఇపుడు నిన్నూ... కొంచెం తిక్క ప్రశ్నలతో తికమక పెట్టిందన్నమాట! అనుకోకుండా వచ్చావు... లోపలికి రాముందు...''

సుమజ తిలోత్తమను పట్టిపట్టి చూస్తూ లోపలకు అడుగుపెట్టింది. తిలోత్తమ కూడా సుమజ చుట్టూ తిరిగి చూస్తూ వంశీతో అంది ''బావా... సుమజా అందంగానే ఉంది! కాకపోతే... నా అంత కాదుగానీ...!'' అంటూ చిన్నగా నవ్వింది.

ఆ మాటలకు సుమజా, వంశీ కూడా చిన్నగా నవ్వారు.

సుమజ చిరునవ్వుతో తలవూపుతూ తిలోత్తమ వైపు చూసి ''మీరన్నది చాలా నిజం...!'' అంది. మళ్ళీ... పక్కనే ఉన్న వంశీతో గుసగుసగా చెప్పింది ''తిలోత్తమ  చాలా అందంగా ఉంది కదూ... మీ అభిప్రాయం మారిందా...?''

వంశీ కూడా అతి మెల్లగా చెప్పాడు సుమజకి. ''అవన్నీ తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం...!''

ఆ సంభాషణకి అక్కడితో ముగింపు అయింది.

* * *

ఎలా, ఎక్కడికి తను వచ్చిందీ వగైరా కబుర్లు అన్నీ వివరంగా సుమజ చెప్పింది. మునుపు వచ్చిన వాళ్ళింటికే తల్లితో కలిసి వచ్చానని చెప్పింది.

ఏదో పనిమీద తిలోత్తమ లోపలకు వెళ్ళినపుడు సుమజ వంశీతో చెప్పింది. ''అత్తయ్యను ఎపుడెపుడు చూద్దామా అని తహతహ కలిగింది! అందుకే ముందుగా మీకు చెప్పకుండానే, అమ్మతో కలిసి వచ్చేశాను!''

వంశీ చిరునవ్వుతో చూస్తూ ''నన్ను చూడాలనిపించి కాదన్నమాట!'' అన్నాడు.

''అవును...'' అంటూ సుమజా నవ్వింది. ''మరి ముందుగా... ఎవర్ని చూడటానికి వచ్చానూ...?'' అని ఎదురు ప్రశ్న వేసింది.

వంశీ సరదాగా నవ్వేశాడు.

ముగ్గురూ కలిసి డాక్టరుగారి హాస్పటల్ కమ్ ఇంటికి బయలుదేరి వెళ్ళారు.

''అత్తయ్య తిలోత్తమని బాగానే గుర్తు పట్టారని అన్నారుగా, అంటే తరచూ  చూసేవాళ్ళకంటే, కొద్ది పరిచయం ఉన్నవాళ్ళే బాగా గుర్తు ఉంటున్నారన్నమాట! ఆ విధంగా నన్నూ గుర్తుపడతారనుకుంటున్నా...!'' అంది సుమజ ఉత్సాహంగా.

కానీ... ఆమె అంచనా తప్పింది! ఎవరో కొత్తవాళ్ళని చూస్తున్నట్లుగా పలకరించకుండా ముభావంగా ఉండేసరికి సుమజ నిరుత్సాహపడింది.

కాసేపటికి అడ్రసు తెలుసుకుని అక్కడికి సుమజ తల్లి భార్గవీ వచ్చింది. అయితే ఆశ్చర్యంగా శ్యామసుందరి ఆవిడను పలకరించి 'సుమజ' గురించి ఆరా తీయటం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.

పక్కనే ఉన్న సుమజ గుర్తించలేదు గానీ ఆవిడను ''మీ అమ్మాయి బావుందా...?'' అనడిగినపుడు ఆవిడ అయోమయంగా చూస్తూ బాగానే ఉందన్నట్లుగా తలవూపింది.

ఆ తర్వాత డాక్టరు ''అలా జరగటంలో వింతేమీ లేదు. అదొక జబ్బులక్షణమే. మందులకు బాగానే స్పందిస్తున్నారు..'' అని చెప్పటంతో అందరూ స్థిమిత పడ్డారు.

ఇక వెళ్ళొస్తామని చెప్పి నుంచున్న, భార్గవీ, సుమజల ను దింపి మేమూ ఇంటికి వెళ్తామన్నట్లుగా చెప్పేసరికి అందరూ లేచి నిలబడగా, శ్యామసుందరి తిలోత్తమ చేయి పట్టుకుని ''నువ్వు మరి కాసేపు నా దగ్గిర కూర్చోమ్మా...!'' అంది.

తిలోత్తమ సరే నంటూ లేచి నిలబడినదల్లా తిరిగి ఆవిడ పక్కమీద కూర్చుని వంశీతో ''బావా... మీరు వాళ్ళని అక్కడ దింపి, ఇంటికి వెళ్ళిపోండి. నేను **కాసేపుండి** వచ్చేస్తా...!'' అని చెప్పింది.

వంశీ నిర్లిప్తంగా తలవూపి బయలుదేరాడు.

* * *

అక్కడ సుమజ చుట్టాలింట్లో దింపాక ...భార్గవి లోపలకు వెళ్ళాక సుమ ఒక్కతే నిలబడింది. ఏదో ఆలోచిస్తున్నట్లున్న వంశీతో 'ఏమిటన'డిగింది.

''అదే... అమ్మ ప్రవర్తన గురించి...'' అంటూ నిట్టూర్చాడు.

''దాని గురించి. అంత ఆలోచన, దిగులు అనవసరం కదా, డాక్టరుగారూ చాలా భరోసాగా మాట్లాడుతున్నారు ... ఆ డాక్టరేమైనా ప్రయోజనం లేదని గానీ, కష్టమేనని గానీ అంటే... దిగులు పడాలి! అవునా...?'' అంది సుమ.

ఏదో ఆలోచిస్తున్న వంశీ ఒక్కసారిగా ఆలోచననుండి బయటకు వచ్చినట్లుగా సుమజని చూసి ''నిన్నొకటి అడగనా...?'' అన్నాడు.

''అనుమతి ఎందుకూ... అడగవచ్చుకదా...!'' అంది సుమజ.

‘‘మా అనూష ఒక మాట అంది. నేను ‘అమ్మ ఆరోగ్యంగా ఇంటికి రాకుండా పెళ్ళిమాట తలపెట్టనూ...’ అంటే... ‘సుమజా వాళ్ళు దానికి అంగీకరించాలి కదా’ అని. అందుకని నాకో సందేహం వస్తోంది. నీ అభిప్రాయం ఏమిటి సుమా...?’’

వంశీ ప్రశ్నకు సుమజ అతనివైపు తేరిపారచూసి ‘‘నేనే మీ పరిస్థితిలో ఉండి, మిమ్మల్ని ఇటువంటి ప్రశ్న అడిగితే, మీ సమాధానం ఎలా ఉంటుందీ...?’’ అంది.

చటుక్కున సుమజవైపు చూసిన వంశీ ఎటువంటి ఆలోచనా లేకుండా వెంటనే సమాధానం చెప్పాడు. ‘‘జీవితాంతం అయినా సరే, నాకు నచ్చిన, నన్ను మెచ్చిన నీలాంటి అమ్మాయి కోసం ఎదురు చూడగలను!’’ అన్నాడు.

సుమజ వదనం ఆనందంతో పువ్వులా విచ్చుకుంది!

‘‘నేను కావాలనుకుని... నాకోసం ప్రేమగా అలా ఎదురుచూస్తూ ఉంటాననే వ్యక్తి ఉన్నాడనే భావం... ఎంత బావుందో తెలుసా...? ఇపుడు... మళ్ళీ చెబుతున్నా... మీ ప్రశ్నకు మీరు చెప్పిన సమాధానమే నాదీ!’’ అంది సుమజ చిరునవ్వుతో.

వంశీ మొహం కూడా ఆ సమాధానానికి వికసించింది.

సుమజకు బై చెప్పి వంశీ ఆనందంగా బయలుదేరాడు. దారి మధ్యలో ఉండగానే అతని ఫోన్ రింగయింది. సుమజే చేసింది.

ఒక చేయి స్టీరింగు మీద ఉంచి ఫోన్ ఆన్ చేసాడు.

‘‘మీకు ఓ మాట చెప్పాలని అనిపించింది. కానీ... మీ ఎదురుగా చెప్పలేక.. ఇపుడు ఫోన్ చేసి చెబుతున్నాను. మీ మాటలు విన్నాక... నాకోసం మీరు ఎదురుచూస్తూ ఎంతకాలమైనా వేచి ఉండగలరనే ఆలోచన ఎంత ఆనందాన్నిస్తుందో ఇపుడు అర్థమైంది! ’ఎంత హాయి... ఈ ఊహ... ఎంత మధురమీ భావం...! ‘ అని సరదాగా ఎలుగెత్తి పాడుకోవాలనిపిస్తోంది...!” అంటూ అల్లరిగా నవ్వింది.

వంశీ కూడా నవ్వుతూ ‘‘నిజమా... నీకైతే పాడుకోవాలని అనిపిస్తోంది! నా మనసైతే... నీ మాట వినీ వినంగానే, అలా ఆలాపన ప్రారంభించేసింది తెలుసా...?’’ అన్నాడు.